# బహుమతి

- తమిరిశ జానకి

"నా బంగారు కొండ... చిన్నారి కృష్ణుడు" మురిసిపోతూ అమ్మ తమ్ముడిని ముద్దు చేస్తుంటే సంతోషంగా అటే చూస్తున్నాడు రంగడు అన్నం తింటూ.

"అమ్మా! తమ్ముడు బావుంటాడు కదమ్మా" అడిగాడు ఓ నిమిషం పోయాక. తమ్ముడంటే వాడికీ ముద్దే.

"ఎందుకు బావుండడూ... నా చిన్ని కృష్ణుడు వీడు.... బంగారం... అయ్యో అదేవిట్రా... సరిగ్గా కలుపుకోలేదన్నం... నేను కలుపుతానుండు" అంటూనే బుజ్జి గాడిని చాపమీద కూచో పెట్టొచ్చి అన్నం మెత్తగా కలిపింది.

అమ్మ కలిపితే ఎంతో రుచిగా అనిపించింది రంగడికి. ప్రతి రోజూ అంతే. అమ్మ చేత కలిపించుకుని తినడం వాడికిష్టం.

అడగకుండానే కలిప్పెడుతుందమ్మ.

అమ్మంటే ఆకాశమంత ఇష్టం వాడికి.

తమ్ముడంటే మరీ మరీ ఇష్టం.

!+!+!+!

స్కూల్‌నించి ఇంటికొచ్చేటప్పుడు దోవలో గోపీ చెప్పిన సమాచారం చాలా కుతూహలం కలిగించింది రంగడికి.

"మా ఇంటిపక్కన మహిళా సంఘం ఉంది కదా. అందులో రేపు బేబీ షో జరుగుతుందిట"

"అంటే?" అడిగాడు వెంటనే.

"రెండు సంవత్సరాలుగానీ అంతకంటే తక్కువ వయసు గానీ ఉన్న పిల్లల్ని తీసికెళ్తే చూడటానికి బావున్న పిల్లలకి బహుమతులిస్తార్ట".

"నిజంగానా?" కళ్ళింత చేసుకుని మరీ అడిగాడు ఆశ్చర్యంగా.

"నిజంగానే".

రంగడి చిన్నారి మనసు ఏవేవో ఊహల్లో తేలిపోతోంది అప్పుడే.

తమ్ముడిని తీసికెళ్తే?

కానీ అమ్మ ఒప్పుకోవద్దూ?

మనలాంటి వాళ్ళక్కాదురా అవన్నీ... గొప్ప గొప్ప వాళ్ళ కోసం అంటుందేమో!

గొప్పేవిటి బీదేవిటి దీనికి?

తమ్ముడు తనకెంత ముద్దొస్తాడు?

చిన్ని క్రిష్ణుడు.... బంగారు తండ్రి అంటూ అమ్మ కూడా రోజుకెన్నో సార్లు అంటుంది. ఔను... తప్పకుండా తమ్ముడిని తీసికెళ్ళాలి.

బహుమతీ వొస్తుంది తమ్ముడికి. కానీ ఎలాగైనా అమ్మవొద్దనే అంటుందేమో!

పోన్లే... ఆపోటీకి తీసికెళ్తున్నట్టుగా అమ్మకి చెప్పకూడదంతే... ఇంటి కొచ్చాక బహుమతి చూపించాలి. అప్పుడెంత సంతోషపడుతుందమ్మ.... చాలా మంచి పని చేశావురా అని మెచ్చుకుంటుంది కూడా. ఈ ఆలోచనతో ఒక నిర్ణయానికొచ్చేశాడు రంగడు.

!+!+!+!

"ఆయా! బాబుకన్నం పెట్టేసెయ్యి. తీసికెళ్ళు" చంద్రావతి పిలుపుతో ఆయా లోపల్నించి పరిగెత్తుకొచ్చింది.

ఆయా దగ్గరకెళ్ళనని మారాం చేస్తూ అమ్మనే అన్నం పెట్టమని చీర పట్టుకు లాగుతున్నాడు బాబు.

ఒళ్ళు మండింది చంద్రావతికి.

కోపంతో ఒక్కటేసింది బాబుని.

దాంతో వాడి ఏడుపు మరింత ఎక్కువైంది.

"పోన్లే నువ్వు పెట్టరాదూ పాపం... అసలెలాగో రోజూ ఆయా పెడితే సరిగ్గా తినటం లేదువాడు. నువ్వు పెడితే సరిగ్గా తింటాడేమో చూడరాదూ!"

భర్త మాటలకి మరింత చిరాకుపడింది చంద్రావతి.

"నాకు టైమెక్కడుంది చెప్పండి? వాడికి అన్నం పెట్టడం ఒక నిమిషంలో అయ్యే పని కాదు.

కబుర్లు చెప్తూ నెమ్మదిగా తినిపించాలి.

అంత తీరుబడి నాకు లేదు. సాయంత్రం మా మహిళా సంఘంలో "బేబీ షో" ఉందని చెప్పాను కదా. దానికి మనబాబుని తీసికెళ్తాను. తప్పకుండా బహుమతి రావాలి వీడికి... అప్పుడే నాకు గర్వంగా ఉంటుంది మిగిలిన వాళ్ళముందు."

"అయితే సాయంత్రం అక్కడికి వెళ్ళడానికీ ఇప్పుడు వీడికి అన్నం పెట్టడానికీ సంబంధం ఏవుంది చెప్పు?...".

"ఎందుకు లేదూ? నాల్గింటికల్లా వాడిని తయారుచేసి నేను తయారై వెళ్ళాలి. కొత్తరకం హెయిర్‌స్టైల్ వేసుకోవాలనుకుంటున్నాను. అదిప్పుడొకసారి వేసి చూసుకోవాలి. ఏ చీర కట్టుకెళ్ళాలో సెలెక్టు చేసి పెట్టుకోవాలి. దానికి సంబంధించిన మ్యాచింగులన్నీ రెడీగా ఉన్నాయో

లేదో చూసుకోవాలి..... అబ్బో! చాలా ప్రిష్టేషన్స్ ఉన్నాయి నాకు... తీరుబడిగా వాడికి తినిపించడానికి కుదరదునాకు." నిక్కచ్చిగా చెప్పేసింది చంద్రావతి.

ఏడుస్తున్న బాబుని బలవంతంగా లాక్కుపోయింది ఆయా.

!+!+!+!

"అమ్మా! సాయంత్రం కాసేపు గోపీ వాళ్ళింటికెళ్తానమ్మా..." మెల్లిగా అడిగాడు రంగడు.

"అలాగే, వెళ్ళువుగానీలే"

"తమ్ముడిని కూడా నాతో తీసికెళ్తానమ్మా"

"వాడెందుకురా?"

"తమ్ముడిని షికారు తీసికెళ్ళడం నాకిష్టం. తీసికెళ్తానమ్మా...." బతిమాలుతున్నట్టుగా అమ్మ చెయ్యి పుచ్చుకున్నాడు.

"తమ్ముడంటే నీకెంత ప్రేమరా... కానీ నువ్వు ఆటల ధ్యాసలో పడిపోతే వాడినెవరు చూస్తారు? అటూ ఇటూ వెళ్ళిపోడూ?"

"అహ... నేనాడను. తమ్ముడిని నాపక్కనే కూచోపెట్టుకుని నేనూ కూచునే ఉంటాను. నేను జాగ్రత్తగా చూసుకుంటానమ్మా".

"సరే... జాగ్రత్తగా తీసికెళ్ళి జాగ్రత్తగా తీసుకురావాలి..."

అమ్మ అనుమతి దొరకడంతో కొండెక్కినంత సంబరమైంది రంగడికి.

గోడవారగా ఉన్న రేకుపెట్టి తెరిచాడు.

తమ్ముడికున్న నాలుగు జతల బట్టల్లోంచీ గులాబీ రంగు చొక్కా నీలిరంగు లాగూ బయటికి తీశాడు.

"అమ్మా! ఈ బట్టలు వెయ్యమ్మా సాయంత్రం తమ్ముడికి. ఇవి బావున్నాయి కదూ?"

"నీ సంబరం బంగారం గానూ... సాయంత్రవెప్పుడో కాసేపలా తిప్పి తీసుకురావడానికి ఇప్పట్నించే హడావిడిపడిపోతున్నావే!"

"చెప్పమ్మా... ఈ బట్టలు బావున్నాయి కదూ..." వాడి ఆరాటం వాడిది.

"బావున్నాయి లేరా?"

తమ్ముడికీ బట్టలు తొడిగితే ఇంకా ముద్దొస్తాడు. ఈ గులాబీ రంగు చొక్కా ఎంత బావుందో!....

రంగడి చిన్నారి మనసు సంబరపడిపోయింది.

!+!+!+!

తమ్ముడి నెత్తుకుని మహిళాసంఘం ఆవరణలో అడుగు పెట్టాడు రంగడు.

ఒక్క నిమిషం తడబడ్డాడు అక్కడంత మందిని చూసి.

అంతా ఆడవాళ్ళే... చిన్న పిల్లలూ ఉన్నారు.

రంగు రంగుల చీరలు...

రకరకాల అలంకరణలు...

కొందరు కుర్చీల్లో కూర్చుని ఉన్నారు.

కొందరు ఇక్కడా అక్కడా గుంపులుగా నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. పిల్లల్ని ఎత్తుకున్న తల్లులు కొందరు ఓపక్కగా నిలబడి ఉన్నారు.

"ఏయ్! ఎవరబ్బాయ్ నువ్వు? ఎవరు కావాలి?"

గదమాయించిందొకావిడ రంగడిని.

భయం భయంగా చూశాడు.

కొండలా ఇంతెత్తు ముడి తలమీద... ఇంత లావు పెద్ద పెద్ద పూసల దండ మెళ్ళో... వాటినే చూస్తున్నాడు రంగడు.

"ఏయ్! నిన్నే... ఎవరు కావాలంటే మాట్లాడవేం?"

"ఎవరూ అక్కర్లేదండీ... ఇక్కడా.. ఏదో పోటీ ఉందిట కదండీ... బావున్న పిల్లలకి బహుమతిలిస్తారుట..."

"ఔను... చూడటానికొచ్చావా?"

"చూడటానికి కాదండీ... మా తమ్ముడిని పోటీకి తీసుకొచ్చానండీ" తమ్ముడి వంక చూసుకున్నాడు ప్రేమగా.

ఒక్కక్షణం తెల్లబోయిందావిడ.

మరుక్షణం నోటికి చెయ్యడ్డు పెట్టుకుని నవ్వడం మొదలెట్టింది.

అలా నవ్వుతూనే... పక్కన గుంపుగా నిలబడి మాట్లాడుకుంటున్న ఓ పది మంది దగ్గిర కెళ్ళి ఏదో చెప్పింది. వాళ్ళంతా బిలబిల్లాడుతూ వొచ్చి రంగడి చుట్టూ మూగారు. వాళ్ళకి నవ్వులాగట్లేదు.

రంగడినీ వాడి తమ్ముడినీ వింత జంతువుల్ని చూసినట్టు చూస్తూ వాళ్ళల్లో వాళ్ళు గుసగుసలు చెప్పుకున్నట్టు మాట్లాడుకుంటూ తెగనవ్వేసుకుంటున్నారు.

రంగడి చిన్నారి మనసు విలవిల్లాడింది.

అమ్మకీ తనకీ ఎంతో ముద్దొస్తాడు తమ్ముడు.

వీళ్ళకి ముద్దురావట్లేదా?

ఎందుకలా నవ్వుతారు?

ఇంక ఒక్క క్షణం అక్కడ నిలబడాలనిపించలేదు వాడికి.

ఆ గుంపులోంచి బయటపడ్డాడు.

"కాకిపిల్ల కాకికి ముద్దు" వెనకనించి ఒకావిడ ఆ మాట అనడం, తక్కిన వాళ్ళంతా పగలబడి నవ్వటం వినిపించింది వాడికి. వెంటనే తమ్ముడి వంక చూశాడు. అమాయకంగా నవ్వులు చిందిస్తున్నాడు వాడు.

"నీకేదన్నా బహుమతి వొస్తుందేమోనని తీసుకొచ్చానురా నిన్నిక్కడికి. కానీ... మనం ఇప్పుడింటికెళ్ళి పోతున్నాం."

అన్నయ్య మాటలు తనకేదో మహా అర్థం అయిపోయినట్టే కిలకిలానవ్వాడు వాడు తనకేం బాధలేదన్నట్టుగా.

వాడినవ్వు చూస్తుంటే మరీ ముద్దొచ్చింది రంగడికి.

బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాడు ఎంతో ప్రేమగా.

అంతకంటే విలువైన గొప్ప బహుమతి ఇంకేం కావాలి ఆ తమ్ముడికి?

★☆★☆★